సాక్షి నిర్మల్

గురువారం ׀ 2 ׀ జనవరి ׀ 2025



బాసరలో భక్తుల రద్దీ 8లో ▸

నూతన సంవత్సరం సందర్భంగా బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో బుధవారం భక్తుల రద్దీ నెలకొంది. అమ్మవారి దర్శనానికి ఉదయం నుంచే బారులుదీరారు.



మక్క సాగుకే మొగ్గు 9లో ▸

జిల్లా రైతులు యాసంగిలో మొక్కజొన్న సాగుచేస్తున్నారు. ఇతర పంటలు పెట్టుబడి పెరగడం.. ఆశించిన దిగుబడి రాకపోవడంతో మక్క సాగుకు మొగ్గు చూపుతున్నారు.

గరిష్టం/కనిష్టం **29.5 / 14.2**

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగలు ఎండగా ఉంటుంది. రాత్రి ఉష్ణోగ్రతలు పడిపోతాయి. చలి ప్రభావం పెరుగుతుంది.

న్యూస్‌రీల్

బాధ్యతలు స్వీకరించిన ఏఎస్పీ



ఎస్పీ జానకీషర్మిలతో ఏఎస్పీ రాజేశ్‌మీనా

నిర్మల్‌టౌన్: నిర్మల్ సబ్ డివిజన్ ఏసీపీగా నియమితులైన రాజేశ్‌మీనా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో ఎస్పీ జానకీషర్మిలను మర్యాదపూర్వకంగా కలిశారు. సబ్ డివిజన్ సమస్యలపై చర్చించారు. రాజేశ్‌మీనా రాజస్థాన్ రాష్ట్రానికి చెందినవారు. జోధ్‌పూర్ ఐఐటీలో ఇంజినీరింగ్ పూర్తి చేశారు. 2022లో ఐపీఎస్‌గా సెలెక్ట్ అయ్యారు. గ్రేహౌండ్స్‌లో దళ కమాండర్‌గా విధులు నిర్వర్తించారు.

డిపోలో రోడ్డు భద్రత మాసోత్సవాలు



సూచనలు చేస్తున్న డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి

నిర్మల్‌టౌన్: నిర్మల్ ఆర్టీసీ డిపోలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను ఈనెల 01 నుంచి 31 వరకు నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి అన్నారు. డ్రైవర్లకు బుధవారం ట్రాఫిక్ నియమాలపై సూచనలు చేశారు. వాహనాలను ఎలా ఓవర్‌టేక్ చేయాలి, మూలమలుపుల వద్ద ఎలా అప్రమత్తంగా ఉండాలనే దానిపై ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. డ్రైవర్లు బస్సులను అతివేగంగా అజాగ్రత్తగా నడుపొద్దని పేర్కొన్నారు. అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్, ఆర్టీసీ సిబ్బంది ఉన్నారు.

గురుబ్రహ్మ అవార్డుకు ఎంపిక



భిక్షపతినాయక్

సోన్: మండలంలోని న్యూ వెల్మల్ బొప్పారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న మాలోవత్ భిక్షపతి నాయక్ గురుబ్రహ్మ అవార్డుకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు విద్యాసాగర్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ మాలోవత్ భిక్షపతి నాయక్ బోధనతోపాటు, విశ్లేషణ రచనలు(నిర్మల్ జిల్లా సమగ్ర స్వరూపం, గిరిజన సంప్రదాయ వైశిష్ట్యం, ఘుగ్రార్ చనక్, గోర్, వెరాళు, విపంచి) వీటితోపాటు కవితలు, వ్యాసాలు, వివిధ పత్రికలలో పదికి పైగా విశ్లేషణ వ్యాసాలు రాశారు. విద్యార్థులను, సమాజాన్ని చైతన్యపరుస్తూ విశిష్ట సేవలందిస్తున్నారని కొనియాడారు. మదర్ థెరిసా సేవా సంస్థ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో జనవరి మూడవ తేదీన నిర్వహించే కార్యక్రమంలో గురుబ్రహ్మ అవార్డును భిక్షపతినాయక్‌కు బహూకరించనున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు కె.కృష్ణమూర్తి తెలిపారు.

జాతీయ పోటీల్లో బీరవెల్లి విద్యార్థుల ప్రతిభ



ఎంపికైన విద్యార్థులు రాకేశ్, దేవేందర్

సారంగపూర్: మండలంలోని బీరవెల్లి ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చారు. చెన్నైలో జరుగుతున్న 30వ సబ్ జూనియర్ నెట్‌బాల్ పోటీల్లో తెలంగాణ–హర్యాన మధ్య జరిగిన మ్యాచ్‌లో తెలంగాణ జట్టు కాంస్య పతకం సాధించింది. జట్టులో ప్రతిభ కనబర్చిన చాకపురం రాకేశ్, ఆవాల దేవేందర్ జాతీయ జట్టుకు ఎంపికయ్యారు.

సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



జాదవ్ శివానంద్

నర్సాపూర్(జి): మండలంలోని అంజనీ తండా గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి జాదవ్ శివానంద్ సీఎం కప్ రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో ప్రతిభ కనబర్చాడు. 51 కేజీల విభాగంలో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించాడు. రూ.10 వేల నగదు బహుమతి అందుకున్నాడు.

అభాగ్యులకు దిక్కెవరు?



జిల్లా కేంద్రంలో ఏ ఆశ్రయం లేక రోడ్లపై తిరుగుతున్న నిరాశ్రయులు

- జిల్లా కేంద్రంలో వంద మందికిపైనే నిరాశ్రయులు
- కానరాని నిరాశ్రయ కేంద్రాలు
- పగలు చెట్ల కింద.. రాత్రి దుకాణాల అరుగులపై..
- మంజూరైన నిధులేమైనట్టు?
- పట్టించుకోని అధికారులు

నిర్మల్‌చైన్‌గేట్: వారు ఎవరికీ పట్టని అభాగ్యులు.. అనారోగ్యంతో కొందరు, మతిస్థిమితం లేక మరికొందరు బాధపడుతూ ఏ ఆసరా లేక న రకం అనుభవిస్తున్నారు. ఎవరైనా దయతలిస్తేనే వారి కడుపునిండేది.. లేదంటే పస్తులే.. ఏ ఆ శ్రయం లేక, ఎక్కడ తల దాచుకోవాలో తెలి యక.. పగటిపూట చెట్ల కింద, రోడ్లపైన.. రాత్రి దుకాణాల అరుగుల మీద సేదదీరుతున్న వీరిని అధికారులు సైతం పట్టించుకోవడం లేదు. నిరాశ్రయ కేంద్రాల నిర్మాణానికి మంజూరైన నిధులేమయ్యాయో కూడా తెలియడంలేదు.

దేశానికి స్వాతంత్య్రం వచ్చి 78 ఏళ్లయినా పేదల బతుకుల్లో మార్పు రావడం లేదు. ఎంతో మంది ఇప్పటికీ పట్టెడు అన్నం కోసం అవస్థలు పడుతున్నారు. ఉండడానికి కనీసం గుడిసెలు కూడా లేని పరిస్థితుల్లో రోడ్ల వెంట జీవనం సాగిస్తున్నారు. నిర్మల్ పట్టణంలో ఎక్కడెక్కడి నుంచో వచ్చిన అనాథలు, నిరుపేదలు వంద మందికిపైగా ఉన్నారు. ఇందులో కొందరు అనారోగ్యంతో బాధపడుతుండగా.. మరికొందరు మతిస్థిమితంలేక ఏ పనీ చేయలేకపోతున్నారు. రోడ్లవెంట, బస్టాండ్ పరిసరాల్లో సంచరిస్తుంటారు. ఇళ్లు, హోటళ్ల వెంట తిరిగి, ఎవరైనా దయతలచి అన్నం పెడితే కడుపు నింపుకుంటారు. లేదంటే బస్టాండ్‌లో నీళ్లు తాగి చెట్లకింద సేదతీరుతారు. రాత్రి వేళలో పలువురు దాతలు అన్నం ప్యాకెట్లు తీసుకుని వచ్చి వీరికి అందిస్తారు. దీంతో ఆ పూటగడుస్తుంది. మరుసటి రోజు ఎవరైనా దయ తలుస్తారేమోనని ఆశగా ఎదురుచూస్తుంటారు. ఆలనాపాలనా చూసేవారు లేక, ఆశ్రయం లేక, తినడానికి తిండి దొరక్క అవస్థలు పడుతున్నారు. వానకు నానుతూ, ఎండకు ఎండుతూ, చలికి వణుకుతూ దుర్భర జీవితాలను అనుభవిస్తున్నారు.

రూ.65 లక్షలు మంజూరైనా..

జిల్లాలో 3 మున్సిపాలిటీల పరిధిలో నిరాశ్రయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఇప్పటికీ అమలు కాలేదు. నిర్మల్‌లో రెండేళ్ల క్రితం రూ.65 లక్షలతో భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. జిల్లా ప్రభుత్వాస్పత్రి ఆవరణలో ఈ భవనం ని ర్మాణానికి భూమి పూజ చేసి పిల్లర్ల వరకు పని పూర్తి చేశారు. అదే తరుణంలోనే బిల్డింగును మె డికల్ కాలేజీ వారు స్వాధీనం చేసుకున్నారు. దీ ంతో నిరాశ్ర యులకు మొండిచేయే మిగిలింది.

అవకాశం ఉన్నా ఆచరణేది?

నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించే అవకాశమున్నా మున్సిపల్ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. నిర్మల్ ఆస్పత్రి భవనం పూర్తయితే అభాగ్యులు, జిల్లా కేంద్రానికి వివిధ పనుల కోసం వచ్చేవారు, ఆసుపత్రికి వచ్చే వారికి రాత్రి సమయంలో అనుకూలంగా ఉండేది. జిల్లాలోని ఇతర పట్టణాల్లో నిరాశ్రయ కేంద్రాల నిర్మాణం ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ తీసుకుని నిరాశ్రయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని అభాగ్యులు కోరుతున్నారు.

బాధ్యత బల్దియాదే!

అనాథలు, నిరాశ్రయులకూ బతికే హక్కు కల్పించాలని సుప్రీంకోర్టు గతంలో సూచించింది. పట్టణాలు, నగరాల్లో రాత్రి బస కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాలను ఆదేశించింది. ప్రతీ కేంద్రంలో నీరు, ఆహారం, మరుగుదొడ్లు, పడుకునేందుకు వసతి కల్పించాలని సూచించింది. వీటిని మున్సిపల్ అధికారులు పర్యవేక్షించాల్సి ఉంటుంది. అనాథలకు ఆవాసం కల్పించి, వారికి ఇంత తిండి పెట్టించాల్సిన బాధ్యత కూడా మున్సిపాలిటీదే.. పట్టణంలో ఎక్కడో ఒకచోట వారికి ఆవాసం ఏర్పాటు చేసి, వారు ఉండడానికి ఆశ్రయం ఇవ్వడంతోపాటు ఆకలి తీర్చాలి. అయితే ఏ ఆశ్రయం లేక రోడ్ల మీద, దుకాణాల వద్ద సేద తీరుతున్న వీరిని అధికార యంత్రాంగం పట్టించుకున్న పాపాన పోవడం లేదు.

అధికారులకు నివేదిస్తాం..



నిరాశ్రయుల కేంద్రం కోసం అధికారులకు నివేదిక అందిస్తాం. గతంలో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో వారి కోసం భవన నిర్మాణం ఏర్పాటుకు చర్యలు తీసుకున్నాం. మెడికల్ కళాశాల రావడంతో కళాశాల వారు స్వాధీనం చేసుకున్నారు. త్వరలోనే నిరాశ్రయుల కోసం భవన నిర్మాణానికి చర్యలు చేపడతాం.

– ఖమర్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్, నిర్మల్

కేజీబీవీ విద్యార్థులతో కలెక్టర్ అల్పాహారం



విద్యార్థినులతో అల్పాహారం చేస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ అభిలాష అభినవ్ కేజీబీవీ విద్యార్థినులతో కలిసి బుధవారం ఉదయం అల్పాహారం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ కూడా విద్యార్థుల బాగోగులు తెలుసుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించార.

'పది'లో హ్యాట్రిక్ ఫలితాలు సాధించాలి

కడెం/పెంబి/ఖానాపూర్: పదో తరగతి ఫలితాల్లో జిల్లా ఈసారి కూడా రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచేలా ఫలితాలు సాధించి హ్యాట్రిక్ కొట్టాలని డీఈవో రామారావు అన్నారు. కడెం, పెంబి మండలం మందపల్లి, ఖానాపూర్ మండలం మస్కాపూర్ కేజీబీవీలను డీఈవో బుధవారం సందర్శించారు. తరగతుల నిర్వహణ, వంటగది, మెనూ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పదో తరగతి ఫలితాల్లో కడెం కేజీబీవీ రెండేళ్లుగా వంద శాతం ఫలితాలు సాధించిందన్నారు. ఈ ఏడాది కూడా సాధించి హ్యాట్రిక్ కొట్టాలని సూచించారు. గడువులోగా సిలబస్ పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యాబోధనకు తాత్కలిక మహిళా ఉపాధ్యాయులను సర్దుబాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను రివైజ్ చేసుకుంటూ బాగా చదువుకోవాలని సూచించారు. మస్కాపూర్ కేజీబీవీలో ఎల్ఈడీ టీవీ ద్వారా అందుతున్న బోధన పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని విద్యార్థులు, ఉపాధ్యాయులకు సూచించారు. పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు చేశారు. ఆయన వెంట కడెం, పెంబి, ఖానాపూర్ ఎంఈవోలు షేక్ హుస్సేన్, రాంచందర్, ప్రేమ్‌సాగర్ తదితరులు ఉన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో రామారావు

టెట్ ఇక్కట్లు

- నేటి నుంచి 20 వరకు పలు సెషన్లలో పరీక్షలు..
- సుదూర ప్రాంతాల్లో పరీక్ష కేంద్రాలు
- అభ్యర్థులకు తప్పని దూర భారం

నిర్మల్‌ఖిల్లా: నేటి నుంచి టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్(టెట్) ప్రారంభం కానుంది. జిల్లా కు చెందిన అభ్యర్థులు దాదాపు 6 వేల పైచిలు కు మంది వివిధ తేదీల్లో పరీక్షలకు హాజరుకానున్నారు. మరోవైపు జిల్లా కేంద్రంలో సెంటర్ లేకపోవడంతో ఇతర జిల్లాల్లో పరీక్ష రాయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 17 జిల్లాల్లో మాత్రమే ఆన్‌లైన్ పరీక్ష కేంద్రాలు కేటాయించారు. ఈ టెట్ పరీక్షలు ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహించడంతో నిర్మల్ జిల్లా కేంద్రంలో సౌకర్యం లేక, పరీక్ష కేంద్రం కేటాయించలేదు. దీంతో జిల్లా చెందిన అభ్యర్థులు 100 నుంచి 300 కిలోమీటర్ల దూరంలోని కేంద్రాల్లో పరీక్ష రాయడానికి వెళ్లాల్సి వస్తోంది. నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్ జిల్లా కేంద్రాలతోపాటు మెదక్, రంగారెడ్డి, హైదరాబాద్ ప్రాంతాల్లో జిల్లాకు చెందిన అభ్యర్థులకు పరీక్ష కేంద్రాలను కేటాయించడంతో అభ్యర్థులు ఒకరోజు ముందుగానే ఆయా ప్రాంతాల వెళ్లాల్సి వస్తోందని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యయ, ప్రయాసలతోపాటు దూరభారం ఉంటుందని వాపోతున్నారు. టెట్ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న సమయంలో పరీక్ష కేంద్రాలను తగిన ప్రాధాన్యత ఆధారంగా ఎంపిక చేసుకున్నప్పటికీ సుదూర ప్రాంతాల్లో కేటాయించడంపై అభ్యర్థులు మండిపడుతున్నారు.

భైంసా బంద్ ప్రశాంతం



మూసి ఉన్న దుకాణాలు

భైంసాటౌన్: నియోజకవర్గంలో హిందూ దేవాలయాలపై దాడులు, దొంగతనాలను నిరసిస్తూ దేవాలయాల పరిరక్షణ సమితి, హిందూ సంఘాల పిలుపు మేరకు భైంసా పట్టణంలో బుధవారం హిందువులు బంద్ పాటించారు. ఉదయం నుంచే దుకాణాలు స్వచ్ఛందంగా మూసి ఉంచారు. స్థానిక కపడా మార్కెట్, పాత, కొత్త సోనాచాందీ మార్కెట్, గాంధీగంజ్, బస్టాండ్ ఏరియా, నిర్మల్ చౌరస్తా ప్రాంతాల్లో రోజంతా దుకాణాలు బంద్ చేశారు. 30 యాక్ట్ అమలు నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఏఎస్పీ అవినాష్‌కుమార్ ఆధ్వర్యంలో భారీగా పోలీసు బందోబస్తు మోహరించారు. తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ స్థానికంగానే ఉండి పరిస్థితిని సమీక్షించారు. అలాగే, నాగదేవత ఆలయంలో దొంగతనం ఘటనలో దుండగులను గుర్తించి శిక్షించాలని, అన్ని ఆలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని హిందూ సంఘాల నాయకులు ఏఎస్పీ అవినాష్‌కుమార్‌తోపాటు తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌కు వేర్వేరుగా మెమొరాండం అందజేశారు. కార్యక్రమంలో చింతపండు మహేశ్, గుజ్జుల్‌వార్ వెంకటేశ్, పెండెప్ కాశీనాథ్, పెరుగు నవీన్, బీజేపీ నాయకులు మల్లేశ్వర్, గౌతం పింగ్లే, రాజన్న, అనిల్, తూమొల్ల దత్తాత్రి తదితరులు పాల్గొన్నారు.

నాగదేవత ఆలయాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే



ఆలయం పరిశీలిస్తున్న రామారావు పటేల్

భైంసాటౌన్: పట్టణ శివారులోని నాగదేవత ఆలయాన్ని ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ బుధవారం సందర్శించారు. ఆలయంలో చోరీ తీరును అడిగి తెలుసుకున్నారు. ఆలయంలో హుండీతోపాటు, విగ్రహ ధ్వంసంపై తీవ్రంగా స్పందించారు. పోలీసులు దుండగులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలన్నారు. ఆయన వెంట బీజేపీ పట్టణ అధ్యక్షుడు మల్లేశ్వర్, సుష్మారెడ్డి, శంకర్ ఉన్నారు. నాగదేవత ఆలయంలో విగ్రహం ధ్వంసం, దొంగతనం ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.మోహన్‌రావు పటేల్ డిమాండ్ చేశారు. అన్ని ఆలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు.

అడ్డ'దారికి'.. ఆర్టీసీ సహకారం..!



బస్టాండ్ నుంచి బయటకు వెళ్లేలా ప్రహరీకి ఏర్పాటు చేసిన మెట్ల మార్గం

భైంసాటౌన్: పట్టణంలో ఆర్టీసీ అధికారుల తీరు అనుమానాలకు తావిస్తోంది. దాదాపు రెండు నెలల క్రితం గుర్తుతెలియని వ్యక్తులు ఆర్టీసీ ప్రహరీలో కొంతమేర కూల్చివేశారు. వాస్తవానికి బస్టాండ్ నుంచి ప్రయాణికులు తమవైపు రావాలనే ఉద్దేశంతో ఈ పని చేసి ఉంటారన్న అనుమానాలున్నాయి. ఈ సందేహాలకు బలమిచ్చేలా ఆర్టీసీ అధికారులు ప్రహరీని పునరుద్ధరించకపోగా, సంస్థ డబ్బుతో మెట్లు ఏర్పాటు చేయడం, ప్రహరీకి అవతలివైపు ప్రైవేట్ స్థలంలో నిర్మించడం గమనార్హం. దీంతో బస్టాండ్ నుంచి ప్రయాణికులను బయటికి పంపడమే అన్నట్లు అనిపిస్తోంది.. అధికారుల తీరు. ఈ విషయమై డీఎం హరిప్రసాద్‌ను వివరణ కోరగా, మహాలక్ష్మి పథకంతో ప్రయాణికులు బయటకు వెళ్లడం లేదని చెప్పడం విశేషం. చుట్టుపక్కల కాలనీల నుంచి ప్రయాణికులు లోనికి వచ్చేందుకు వీలుగా మెట్లు ఏర్పాటు చేశామని చెప్పారు. కానీ, మహాలక్ష్మి పథకంతో బస్సుల్లో రద్దీ పెరిగి, సకాలంలో బస్సులు లేక కొందరు ప్రయాణికులు బస్టాండ్ ప్రహరీకి అవతల ఉన్న ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఉన్నతాధికారులు ఈ విషయమై దృష్టి సారించి సంస్థ ఆదాయానికి గండి పడకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

ఇంటర్ విద్యార్థులకు ఇంగ్లిష్ ప్రాక్టికల్స్

- పరీక్షల తేదీలను ప్రకటించిన ఇంటర్ బోర్డు
- నైపుణ్యాలు పెరిగాయంటున్న అధ్యాపకులు

జిల్లాలో విద్యార్థుల సంఖ్య	
ఇంటర్ ఫస్ట్ ఇయర్	7,037
ఇంటర్ సెకండియర్	6,706
మొత్తం విద్యార్థులు	13,743



లక్ష్మణచాంద: ఇంటర్ విద్యార్థుల్లో ఆంగ్ల భాష నైపుణ్యాలు పెంపొందించేందుకు ఇంటర్ బోర్డు ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా గతేడాది ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లిష్‌లో ప్రాక్టికల్స్ నిర్వహించాలని నిర్ణయించింది. గతేడాది ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఆంగ్లంలో ప్రాక్టికల్స్ నిర్వహించారు. దీంతో విద్యార్థుల్లో ఆంగ్ల భాషలో నైపుణ్యం మెరుగుపడింది. విద్యార్థుల్లో బోర్డు ఆశించిన ఫలితాలు రావడంతో ఈ విద్యా సంవత్సరం ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థులకు కూడా ఆంగ్లంలో ప్రాక్టికల్స్ నిర్వహించాలని ఇంటర్‌బోర్డు నిర్ణయించింది.

భాషా నైపుణ్యాలను పెంచేందుకు...

గ్రామీణ ప్రాంత విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి వరకు తెలుగు మాధ్యమంలో విద్యను అభ్యసిస్తున్నారు. అనంతరం ఇంటర్‌కు వెళ్లిన తర్వాత ఆంగ్ల మాధ్యమంలో విద్యను అభ్యసించే క్రమంలో ఆంగ్లంలో సరైనా భాష నైపుణ్యాలు లేక ఇబ్బంది పడుతున్నారు. దీనిని అధిగమించేందుకు, ఆంగ్లంలో భాష నైపుణ్యాలను పెంపొందించిందుకు ఇంగ్లిష్ ప్రాక్టికల్స్ న్విహిచింది. ప్రాక్టికల్స్‌కు 20 మార్కులను కేటాయించింది. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన ప్రాక్టికల్స్‌తో విద్యార్థుల్లో ఆంగ్ల భాషలో నైపుణ్యాలు మెరుగుపడినట్లు ఇంగ్లిష్ అధ్యిపకులు పేర్కొన్నారు.

పరీక్షల నిర్వహణ ఇలా...

ఇంటర్ మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులకు ఆంగ్లంలో ప్రాక్టికల్స్ నాలుగు విభాగాలలో నిర్వహిస్తున్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు కమ్యూనికేషన్ ఫంక్షన్, జస్ట్ ఎ మినిట్, రోల్ ప్లే, లిజనింగ్ కాంప్రహెన్సివ్ తదితర అంశాలపై ప్రశ్నలు రూపొందిస్తుంది. రెండో సంవత్సరంలో డిస్క్రైబింగ్ ఏ టాపిక్, ప్రజెంటేషన్ స్కిల్, గ్రూప్ డిస్కషన్, లిజనింగ్ కాంప్రహెన్సివ్ వంటి అంశాలపై ప్రశ్నలు ఉండనున్నాయి. నాలుగు విభాగాలలో ఒక్కో విభాగానికి 4 మార్కులు అలా నాలుగు విభాగాలకు 16 మార్కులు కేటాయించగా మిగిలిన 4 మార్కులు విద్యార్థులు రాసే రికార్డు కేటాయించారు. ఇలా మొత్తం 20 మార్కులు ఆంగ్లం ప్రాక్టికల్‌కు కేటాయించారు.

వెలువడిన షెడ్యూల్...

ఇంటర్ మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులకు ఆంగ్లంలో ప్రాక్టికల్స్ నిర్వహించే తేదీలను ఇంటర్ బోర్డు ఇదివరకే ప్రకటించింది. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు జనవరి 31న, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఆంగ్లం ప్రాక్టికల్స్‌ను ఫిబ్రవరి 1న నిర్వహించనున్నారు.

పూర్తి అయిన సిలబస్..

ఇంటర్ మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులకు ఆంగ్లంలో నిర్వహించే ప్రాక్టికల్స్‌కు సంబంధించిన సిలబస్‌లు ఇదివరకే పూర్తి అయ్యాయని జిల్లాలోని ఆయా జూనియర్ కళాశాల ఆంగ్ల అధ్యాపకులు అంటున్నారు. సిలబస్‌లు పూర్తి చేయడంతోపాటు ఇప్పటికే ఆంగ్లం ప్రాక్టికల్ పరీక్షకు విద్యార్థులను సన్నద్ధం చేశామని, విద్యార్థులు రికార్డులను కూడా రాయడం పూర్తయిందని ఆంగ్ల అధ్యాపకులు తెలిపారు.

భాషా నైపుణ్యాలు మెరుగు..



ఇంటర్ మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులకు నిర్వహిస్తున్న ఆంగ్లం ప్రాక్టికల్స్‌తో విద్యార్థుల్లో ఆంగ్ల భాషా నైపుణ్యాలు మెరుగవుతాయి. మొదటి సంవత్సరంలో ఆంగ్లంలో ప్రాక్టికల్ నిర్వహించడంతో విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలు మెరుగయ్యాయి. రెండో సంవత్సరం ప్రాక్టికల్స్‌తో మరింత మెరుగు కానున్నాయి.

– సురేశ్, ఆంగ్ల అధ్యాపకుడు ప్రభుత్వ జూనియర్ కళాశాల

బోర్డు నిర్ణయం మేరకు



ఇంటర్ బోర్డు తీసుకున్న నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటున్నాం. గత సంవత్సరం మొదటి సంవత్సరం, ఈసారి రెండో సంవత్సరం విద్యార్థులకు కూడా ఆంగ్లం ప్రాక్టికల్స్ నిర్వహించాలని బోర్డు సూచించింది. ఇందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– పరశురామ్ నాయక్, జిల్లా నోడల్ అధికారి

గాంధీ విగ్రహానికి 'సమగ్ర' ఉద్యోగుల వినతి

నిర్మల్ రూరల్: సమగ్ర శిక్ష ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని జిల్లా కేంద్రంలో చేపట్టిన సమ్మె బుధవారం 24వ రోజుకు చేరింది. ఉద్యోగులు దీక్ష శిబిరం ఎదుట ఉన్న గాంధీ పార్కులోని గాంధీ విగ్రహానికి తమ సమస్యలతో కూడిన వినతిపత్రం అందించిన నిరసన తెలిపారు. 20 ఏళ్లగా చాలీచాలని వేతనాలతో ఇబ్బంది పడుతున్నామన్నారు. అధికారులు విద్యాశాఖలో ఏ పని చెప్పినా చేశామని తెలిపారు. ప్రభుత్వం తమపై కక్ష కట్టిందని పేర్కొన్నారు. తమ డిమాండ్లను పరిష్కరించి వెట్టిచాకిరీ, శ్రమ దోపిడీ నుంచి విముక్తి కల్పించాలన్నారు. టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆరెపల్లి విజయకుమార్ దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. గంగాధర్, నరేశ్, రాము, నవిత, గంగాధర్, ఆనంద్, సాయినాథ్, రమేశ్, రాజువర్మ, రమణ, లక్ష్మి, రజిత, అపర్ణ పాల్గొన్నారు.



గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

క్లుప్తంగా

మతిస్థిమితం లేని వృద్ధురాలు మృతి

ఇచ్చోడ: మండలంలోని మల్యాల్ గ్రామానికి చెందిన భూతి రాజుబాయి (75) అనే మతి స్థిమితం లేని వృద్ధురాలు పత్తి చేనులో మృతిచెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. రాజుబాయి డిసెంబర్ 30న ఎవరికి చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో డిసెంబర్ 31న పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఈక్రమంలో బుధవారం అదే గ్రామానికి చెందిన చాహకటి ఈశ్వర్ పత్తి చేనులో వృద్ధురాలు మృతి చెంది ఉన్నట్లు గుర్తించి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని గొల్లపేట్ సమీపంలో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. మృతుడి వయస్సు 60 సంవత్సరాలు ఉంటుందని, మృతుడి వివరాలు ఎవరికైనా తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి


శ్రీనివాస్ (ఫైల్)

మంచిర్యాలక్రైం: రోడ్డు దాటుతుండగా వాహనం ఢీకొట్టి వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తా సమీపంలో చోటుచేసుకుంది. ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని సంజీవయ్య కాలనీకి చెందిన మహంకాళి శ్రీనివాస్(50) తన అన్నయ్య మహంకాళి అంజయ్యతో కలిసి పని మీద స్థానిక ఐబీ చౌరస్తాకు వెళ్లాడు. అక్కడ శ్రీనివాస్ కాలినడకన రోడ్డు దాటుతుండగా శ్రీరాంపూర్ వైపు నుంచి అతి వేగంగా వచ్చిన టాటా ట్రాలీ బలంగా ఢీకొట్టింది. దీంతో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీనివాస్‌కు భార్య శ్యామల, ఇద్దరు కుమారులు ఉన్నారు. శ్యామల ఫిర్యాదు మేరకు ట్రాలీ డ్రైవర్ ఎండీ ఫిరోజ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై తెలిపారు.

నేడు నాగోబా జాతర నిర్వహణపై సమీక్ష

ఇంద్రవెల్లి: ఈ నెల 28న మెస్రం వంశీయుల మహాపూజతో ప్రారంభించనున్న నాగోబా జాతర నిర్వహణపై కలెక్టర్ రాజర్షిషా ఆధ్వర్యంలో గురువారం సమీక్ష నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో రాజమౌళి ప్రకటనలో తెలిపారు. నాగోబా దర్బార్ హాల్‌లో సమావేశం మధ్యాహ్నం 12 గంటల నుంచి ప్రారంభం కానున్నట్లు పేర్కొన్నారు. అధికారులు, మెస్రం వంశీయులు హాజరు కావాలని ఆయన కోరారు.

సమయానికి చేరదేమి..!

ఓ మండలానికి చెందిన దంపతులు నిర్మల్ బస్టాండ్‌లో సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్ వెళ్లే బస్సు ఎక్కారు. బస్సు రాత్రి 10 గంటలకు హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్ బస్‌స్టేషన్‌కు చేరుకోవాల్సి ఉండగా, గంట 15 నిమిషాలు ఆలస్యంగా 11.15 గంటలకు చేరుకుంది. ఆ దంపతులే డిసెంబర్ 26వ తేదీన తిరుగు ప్రయాణంలో సాయంత్రం 4.20 గంటలకు ఎంజీబీఎస్‌లో బస్సు ఎక్కారు. మార్గమధ్యలో బస్సును ఓ దాబా వద్ద దాదాపు 40 నిమిషాల పాటు ఆపారు. నిర్మల్‌కు రాత్రి 10 గంటలకు చేరుకోవాల్సిన బస్సు రాత్రి 11.30 గంటలకు చేరుకుంది. దీంతో సదరు దంపతులు సంవత్సరం వయస్సు ఉన్న వారి పాపతో చలిలో ఇబ్బందులు పడ్డారు.


తుప్రాన్ వద్ద గల ఓ దాబా ఎదుట ఆగిన బస్సు

- హైదరాబాద్‌కు సకాలంలో చేరుకోని బస్సులు
- ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు రావడంలో సైతం ఆలస్యం
- గంటన్నర లేట్ అవుతున్న వైనం
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

హైదరాబాద్‌కు వెళ్లే బస్సుల వివరాలు..

నిర్మల్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే బస్సులు (నిర్మల్ డిపో) : 29
ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే బస్సులు (ఆదిలాబాద్ డిపో) : 23

బోథ్: ఆర్టీసీ అంటేనే ప్రజల్లో ఓ నమ్మకం. ఆర్టీసీ బస్సులు సురక్షితం.. అనే భావన ప్రజల్లో ఉంది. డ్రైవర్లు, సిబ్బంది ప్రజలతో మమేకమవుతూ సంస్థను లాభాల బాటలో నడిపించేందుకు కృషి చేస్తున్నారు. కాగా ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు చెందిన బస్సులు హైదరాబాద్‌కు చేరుకోవడానికి, హైదరాబాద్ నుంచి జిల్లాలకు రావడానికి చాలా ఆలస్యమవుతోంది. జిల్లాల్లో తిరిగే బస్సులు సమయానికి గమ్యస్థానాలు చేరుకుంటున్నా హైదరాబాద్‌కు రాకపోకలు సాగించే ఆదిలాబాద్, నిర్మల్ డిపోలకు చెందిన బస్సులు మాత్రం సమయానికి చేరుకోవడం లేదు. బస్సులు గమ్యస్థానానికి చేరుకోవాల్సిన సమయం కన్నా ఏకంగా గంటన్నర ఆలస్యంగా చేరుకోవడంతో ప్రయాణికులు అసహనానికి గురవుతున్నారు. హైదరాబాద్‌లో పని నిమిత్తం వెళ్లే వారు సైతం ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో బస్సులు సమయానికి చేరుకోకపోవడంతో తమ గ్రామాలకు వెళ్లే చివరి బస్సులను అందుకోలేకపోతున్నామని ప్రయాణికులు పేర్కొంటున్నారు.

ఆలస్యానికి పలు కారణాలు..

జిల్లాల నుంచి హైదరాబాద్‌కు వెళ్లాల్సిన బస్సులు, అక్కడి నుంచి రావాల్సిన బస్సులు ఆలస్యంగా రావడంలో అనేక కారణాలు ఉన్నాయి. బస్టాండ్‌లో బస్సు పాయింట్ వద్ద బస్సు సమయానికి ప్రారంభం కాకపోవడం.. హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యల వల్ల ఆలస్యంగా వస్తున్నాయి. ఎంజీబీఎస్ నుంచి జేబీఎస్ వరకు రావాలంటే గంట సమయం పడుతోంది. దీనికితోడు సుచిత్ర, కొంపల్లి, మేడ్చల్ వద్ద ఫ్లైఓవర్‌లు నిర్మాణంలో ఉండటంతో ట్రాఫిక్ భారీగా ఉంటోంది. దీనివల్ల బస్సులు సమయానికి గమ్యస్థానాలు చేరుకోవడం లేదు.

దాబాల వద్ద..

మార్గమధ్యలో భోజనం చేయడానికి బస్సులను పలు దాబాలు, హోటళ్ల వద్ద దాదాపు 40 నిమిషాల పాటు ఆపుతున్నారు. దీనివల్ల కూడా ఆలస్యం జరుగుతోంది. ప్రయాణికులు మూత్రవిసర్జన కోసం, భోజనం కోసం ఆపాలని కోరుతున్నట్లు పలువురు డ్రైవర్లు పేర్కొంటున్నారు. అయితే బస్సులను మూత్రశాలలు సరిగా లేని, భోజనం నాణ్యతగా లేని హోటళ్లు, దాబాల వద్ద ఆపుతున్నారని, దీంతో ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు.

రోడ్డు పనులతో ఆలస్యం..

రోడ్డు పనుల కారణంగా ఆదిలాబాద్, నిర్మల్‌ల నుంచి హైదరాబాద్‌కు వెళ్లడానికి, అక్కడి నుంచి తిరుగు ప్రయాణానికి కొంత ఆలస్యం జరుగుతోంది. మేడ్చల్, కోంపల్లి, సుచిత్ర వద్ద ఫ్లైఓవర్‌లు నిర్మాణంలో ఉన్నాయి. ట్రాఫిక్ వల్ల కూడా ఆలస్యమవుతోంది. ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం.

– ప్రవీణ్ కుమార్, ఆర్టీసీ డిప్యూటీ ఆర్‌ఎం, ఆదిలాబాద్

నేడు జంగుబాయి క్షేత్రంలో దీపోత్సవం


పూజలు చేసే జెండాలు


జంగుబాయి గుహ ఎదుట ఉండే మైసమ్మ

కెరమెరి: జంగుబాయి ఉత్సవాల్లో భాగంగా గురువారం ఆదివాసీలు భక్తిశ్రద్ధలతో దీపోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఎనిమిది గోత్రాల కటోడాలు, ఆదివాసీలు ఆలయ సన్నిధిలో కొలువుదీరిన దేవతా విగ్రహాలను టొప్లకస నుంచి తీసుకవచ్చిన గంగాజలంతో శుద్ధి చేస్తారు. అనంతరం రావుడ్, పోచమ్మ ఆలయంలోని ప్రతిమలకు ప్రత్యేక పూజలు చేశాక అమ్మవారి గుహకు చేరి దీపం వెలిగిస్తారు. కమిటీ సభ్యులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు.

మందు బాబులపై పోలీసుల కొరడా

ఆదిలాబాద్‌టౌన్: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా నిబంధనలు అతిక్రమించిన వారిపై మంగళవారం రాత్రి పోలీసులు కొరఢా ఝుళిపించారు. ఆదిలాబాద్ పోలీసు డివిజన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 55 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి తెలిపారు. ఆదిలాబాద్ డివిజన్ పరిధిలో ప్రత్యేకంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. పరిమితికి మించి శబ్దంతో వెళ్తున్న ఓ ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు.

భీమారంలో..

భీమారం: మండల కేంద్రంలో మంగళవారం రాత్రి నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ తెలిపారు. మంచిర్యాల– చెన్నూరు జాతీయరహదారిపై పోలీసులు తనిఖీలు నిర్వహించారు.

10 మందిపై కేసు..

లక్ష్మణచాంద: మండలంలో 10 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. మంగళవారం రాత్రి 10 గంటల నుంచి ఎస్సై సుమలత ఆధ్వర్యంలో చేపట్టిన తనిఖీలలో మద్యం సేవించి వాహనాలు నడిపిన మొత్తం 10 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ఎస్సై సుమలత తెలిపారు.

మహాత్మునికి అవమానం


గాంధీ విగ్రహం నోట్లో సిగరెట్ పెట్టిన యువకులు


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ

- మద్యం మత్తులో యువకుల దుశ్చర్య
- కేసు నమోదు.. పలువురి అరెస్ట్

నిర్మల్‌రూరల్: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా డిసెంబర్ 31 అర్ధరాత్రి వేళ.. కొందరు యువకులు తప్పతాగి గాంధీ విగ్రహాన్ని అవమానించారు. ఈ ఘటన నిర్మల్ రూరల్ మండలం నీలాయిపేటలో జరిగింది. స్థానికులు, రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. మంగళవారం రాత్రి నూతన సంవత్సర వేడుకల సందర్భంగా నీలాయిపేట గ్రామంలో పలువురు యువకులు వేడుకలు నిర్వహించారు. డీజే, ఆటపాటలతో సంబరాలను నిర్వహించారు. పక్క గ్రామమైన అనంతపేటకు చెందిన పలువురు యువకులు అదే సమయంలో తప్పతాగి పక్కనే ఉన్న జాతీయ రహదారిపైకి వెళ్తూ నీలాయిపేటలో కాసేపు ఆగారు. అక్కడ ఉన్న యువకులతో వాగ్వివాదం పెట్టుకున్నారు. అంతటితో ఆగకుండా బస్టాండ్‌లో ఉన్న గాంధీ విగ్రహాన్ని అవమానం కలిగించారు. విగ్రహం నోట్లో సిగరెట్ పెట్టి, బీడీ కట్ట విగ్రహం పక్కన ఉంచారు. విగ్రహం పక్కన ఉన్న జెండాలు ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు అక్కడికి చేరుకోవడంతో పరారయ్యారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఏఎస్పీ రాజేశ్‌మీనా, రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్సై లింబాద్రి బుధవారం గ్రామానికి వెళ్లి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మహాత్ముడిని అవమానించిన అనంతపేటకు చెందిన 9 మంది యువకులను గుర్తించారు. 8 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మరొకరు పరారీలో ఉన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దుబాయ్‌లో జిల్లావాసి వెతలు

- పక్షవాతంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జైరామ్
- స్వగ్రామానికి పంపే ఏర్పాట్లు చేస్తున్న మైగ్రేంట్స్ ఫోరం ప్రతినిధులు


దుబాయ్‌లో చికిత్స పొందుతున్న జైరామ్

నిర్మల్‌ఖిల్లా: పొట్ట చేతపట్టుకొని ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశాలకు వెళ్తున్న జిల్లావాసులు వివిధ కారణాల రీత్యా అనారోగ్యం బారిన పడుతున్నారు. నిర్మల్ జిల్లా నర్సాపూర్ –జి మండలం గొల్లమాడ గ్రామానికి చెందిన కేసారం జైరామ్ ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లాడు. అతను పక్షవాతం బారినపడడంతో అక్కడి యాజమాన్యం ఆసుపత్రిలో చేర్పించింది. ప్రస్తుతం చికిత్స కొనసాగుతుండగా కుటుంబ సభ్యులకు అతని ఆచూకీ తెలియక గతకొన్ని రోజులుగా ఆందోళన చెందారు. అక్కడి మైగ్రేంట్స్ రైట్స్ వెల్ఫేర్ ఫోరం, దుబాయ్ శాఖ సమన్వయకర్త జంగం బాలకిషన్, ప్రతినిధి కోటపాటి నరసింహానాయుడుల చొరవతో బాధితుడి పూర్తి వివరాలను సేకరించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. చికిత్స పొందుతున్న జైరామ్‌ను కుటుంబ సభ్యులతో వీడియో కాల్ ద్వారా మాట్లాడించారు. ఆరోగ్యం మెరుగైన అనంతరం ఇండియాకు పంపేందుకు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేస్తున్నట్లు మైంగ్రేట్స్ ఫోరం ప్రతినిధులు బుధవారం వెల్లడించారు.

అడవి కుక్కలదాడి.. 55 మేకలు మృతి


మేకల కళేబరాలు

కోటపల్లి: మేకల మందపై అడవి కుక్కలు దాడిచేయడంతో 55 మేకలు మృతిచెందాయి. వివరాల్లోకి వెళ్తే.. నక్కలపల్లి గ్రామానికి చెందిన ముల్కల్ల వెంకటి మేకలు కాస్తూ జీవనం సాగిస్తున్నాడు. తన కున్న 140 మేకలను రోజులాగే బుధవారం గ్రామ శివారులోని ఆటవీ ప్రాంతంలోకి మేతకు తీసుకెళ్లాడు. ఒక్కసారిగా అడవికుక్కలు మేకల గుంపుపై దాడిచేయగా 55 మేకలు మృత్యువాత పడగా 22 మేకలు కనిపించకుండా పోయాయి. సుమారు రూ.6లక్షల విలువ గల జీవాలు మృతిచెందినట్లు బాధితుడు వాపోయాడు. అధికారులు స్పందించి నష్టపరిహారం ఇప్పించాలని వేడుకున్నాడు.

చికిత్స పొందుతూ రైతు మృతి

తిర్యాణి: పురుగుల మందు తాగిన రైతు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై మాధవ్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం చింతపెల్లి పంచాయతీ పరిధి ఇర్కపెల్లి గ్రామనికి చెందిన కుడ్మెత మారుతి(35) అనే రైతు అప్పుల బాధ తాళలేక గత నెల 28న ఇంట్లో గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి మంచి ర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బుధవారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. భార్య వనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రిమ్స్ నుంచి రిమాండ్ ఖైదీ పరారీ

ఆదిలాబాద్‌టౌన్: అనారోగ్యంతో రిమ్స్‌లో చికిత్స పొందుతున్న రిమాండ్ ఖైదీ మంగళవారం అర్ధరాత్రి తర్వాత పరారయ్యాడు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని సుర్జాపూర్‌కు చెందిన ఖైదీ ఇటీవల పోక్సో రేప్ కేసులో నిందితుడిగా ఉన్నాడు. నిర్మల్ జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. అనారోగ్యం బారిన పడడంతో జైలు అధికారులు డిసెంబర్ 27న జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తీసుకొచ్చారు. ఎస్కార్ట్ ఉన్నప్పటికీ వారి కళ్లుకప్పి ఖైదీ పరారైనట్లు నిర్మల్ ఏఆర్ ఏఎస్సై ఉయిక లల్లు పేర్కొన్నాడు. ఆయన మావల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు.

నిర్మల్ క్లబ్‌పై పోలీసుల దాడి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని నిర్మల్ క్లబ్‌పై మంగళవారం అర్ధరాత్రి పట్టణ పోలీసులు దాడులు నిర్వహించారు. ముందస్తు అనుమతులు లేకుండా రాత్రి 11 గంటల ప్రాంతంలో నిర్వాహకులు డిసెంబర్ 31 వేడుకలు జరిపారు. యువతులను రప్పించి ఆటపాటలు నిర్వహించారు. సమాచారం అందుకున్న పోలీసులు క్లబ్‌పై దాడి చేశారు. చుట్టుపక్కల వారికి ఇబ్బంది కలిగేలా భారీ శబ్దాలతో డీజే నిర్వహించడంతో పాటు అనుమతి లేకుండా ఆర్కెస్ట్రా నిర్వహించినందుకు నిర్మల్ క్లబ్ నిర్వాహకులు ఎర్రవోతు రాజేందర్, ఇతరులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

అంతర్జాతీయ కథల పోటీల్లో విద్యార్థిని ప్రతిభ


శ్రీవేద

ఆదిలాబాద్‌టౌన్ (జైనథ్): కేరళకు చెందిన అంతర్జాతీయ పిల్లల మాసపత్రిక గడుగ్గాయి సంక్రాంతి సందర్భంగా కథల పోటీలను ఆన్‌లైన్‌లో నిర్వహించింది. జైనథ్ మండలంలోని లక్ష్మీపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థిని గాజంగుల శ్రీవేద రాసిన 'ఒకరికొకరు' అనే కథ రెండో బహుమతికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పోరెడ్డి అశోక్ బుధవారం తెలిపారు. విద్యార్థినికి ప్రశంసా పత్రంతో పాటు నగదు బహుమతి అందజేయనున్నట్లు పేర్కొన్నారు. మరో విద్యార్థి రాంచరణ్ రాసిన 'తెలివైన కోడి' కథకు ప్రత్యేక బహుమతి లభించిందన్నారు.

బాసరలో భక్తుల రద్దీ


బారులుదీరిన భక్తులు

బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో బుధవారం భక్తుల రద్దీ నెలకొంది. వేకువజామున అమ్మవారికి విశేష అభిషేకం, అర్చన, పూజలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి భక్తులు క్యూలైన్‌లో బారులుదీరారు. అక్షరాభ్యాస మండపాలు చిన్నారులతో కిటకిటలాడాయి. కాగా ముధోల్ నియోజకవర్గం ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్య నారాయణ గుప్తాలు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. – బాసర


అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యేలు


అమ్మవారి దర్శనం చేసుకుంటున్న భక్తులు

ఘనంగా భీమా కోరెగావ్ విజయోత్సవం

ఇంద్రవెల్లి: మండలంలోని అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల కమిటీ, భీం ఆర్మీ, దళిత సంఘాల ఆధ్వర్యంలో భీమా కోరెగావ్ విజయోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహంతో పాటు 1818 జనవరి 1న జరిగిన పెష్వా యుద్ధంలో వీరమరణం పొందిన మహార్ వీర సైనికుల స్మారకంగా ఏర్పాటు చేసిన స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దళితుల బౌద్ధ ఉపాసకుల ఆధ్వర్యంలో పంచశీల్, త్రిశరణ్, బుద్ధవందన, ధమ్మవందన, సంఘవందన తీసుకున్నారు. పీఏసీఎస్ చైర్మన్ మారుతి డొంగ్రె, మాజీ ఎంపీపీ కనక తుకారం, అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్, ప్రధాన కార్యదర్శి కామ్‌రాజ్ వాగ్మరే, ఉపాధ్యక్షుడు శివాజీ పవార్, ఆయా పార్టీలు, ఆయా సంఘాల నాయకులు ఆర్క ఖమ్ము, దిలీప్ మోరే, రాథోడ్ అనిల్, ఎండీ మసుద్, ఉత్తం, లహుదాస్, మస్కే రాజువర్ధన్ తదితరులు ఉన్నారు.


ప్రార్థన చేస్తున్న దళిత సంఘాల నాయకులు

బైక్ ప్రమాదం.. తీరని శోకం


మంద రాజు (ఫైల్)


పవన్‌కల్యాణ్ (ఫైల్)

దండేపల్లి: బైక్ ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మణం చెందడం.. రెండు కుటుంబాల్లో తీరని శోకాన్ని మిగిల్చింది. దండేపల్లి మండల కేంద్రం సమీపంలో మంగళవారం రాత్రి ప్రమాదవశాత్తు బైక్ కాలువలో పడ్డ ఘటనలో దండేపల్లికి చెందిన మంద రాజు(35), జిల్లపెల్లి పవన్‌కల్యాణ్(23) మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా వారి మృతితో రెండు కుటుంబాల్లో విషాదం నెలకొంది.

అమ్మ, నాన్నలేని అనాథగా..

మందరాజు మృతి చెందడంతో ఐదో తరగతి చదువుతున్న అతని కూతురు హర్షిత అమ్మా, నాన్నలేని అనాథగా మారింది. రెండేళ్ల క్రితం రాజు భార్య కమల అనారోగ్యంతో మృతి చెందింది. ఇప్పుడు రాజు సైతం మృతిచెందాడు. దీంతో ఆయన కూతురు హర్షిత రోదనలు మిన్నంటాయి. రాజుకు తల్లి బాలమ్మ ఉంది. ఇతనిది నిరుపేద కుటుంబం కావడంతో కాలనీవాసులే అంత్యక్రియలు నిర్వహించారు.

నెల క్రితమే వివాహం..

జిల్లపెల్లి చంద్రమౌళి –సువర్ణ దంపతులకు పవన్‌కల్యాణ్‌తో పాటు కూతురు ఉంది. కూతురుకు వివాహం చేశారు. పవన్‌కల్యాణ్‌కు నెల క్రితమే వివాహం జరిగింది. కుటుంబానికి అండగా నిలిచే కుమారుడు బైక్‌ప్రమాదంలో మృతి చెందడంతో తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోతున్నారు.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

భైంసారూరల్: మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ప్రభాకర్ (34) అనే యువకుడు బుధవారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై మాలిక్ తెలిపారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ప్రభాకర్ కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఎన్ని ఆసుపత్రుల్లో చికిత్స తీసుకున్నా తగ్గకపోవడంతో మనస్తాపం చెంది బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు మృతదేహాన్ని భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్యతో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి


తోట గంగాధర్ (ఫైల్)

వాంకిడి: చికెన్ కొనేందుకు మండల కేంద్రానికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదానికి గురై ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి చెందిన ఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా నర్సాపూర్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన తోట గంగాధర్(29) కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలోని ఖమాన గ్రామంలో గల తేలివాడ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహించేవాడు. ఈక్రమంలో ఖమానా గ్రామంలోనే ఇల్లు అద్దెకు తీసుకున్నాడు. కాగా 6 నెలల క్రితం గంగాధర్‌కు ప్రమోషన్ రావడంతో నవేగూడ ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎంగా బదిలీ అయ్యాడు. ఖమాన గ్రామంలోనే ఉంటూ విధులకు హాజరయ్యేవాడు. బుధవారం సాయంత్రం చికెన్ కొనేందుకు వాంకిడి వెళ్లి తిరిగి వచ్చే క్రమంలో ఖమాన గ్రామ సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. వాంకిడి వైపు వెళ్తున్న కొందరు వ్యక్తులు ద్విచక్రవాహనం పడి ఉండటాన్ని గమనించారు. గంగాధర్ తలకు తీవ్రమైన గాయాలతో పడి ఉన్నాడు. వెంటనే ఆయనను అంబులెన్స్‌లో వాంకిడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఆసిఫాబాద్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. కాగా అక్కడి వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రమాదానికి గల కారణాలపై ఎస్సై ప్రశాంత్‌ను సంప్రదించగా రోడ్డు ప్రమాదంపై ఇంకా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.